క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



పాంఢ్రపాడు(కాకుమాను):పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. మండలంలోని పాంఢ్రపాడు, కొల్లిమర్ల, చినలింగాయపాలెం, వల్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్ని బుధవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ క్షణమైనా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తుప్పు తెగులుపై అప్రమత్తత అవసరం



వరగాని(కాకుమాను):రబీలో శనగ సాగు చేస్తున్న రైతులంతా తుప్పు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని వరగానిలో బుధవారం రైతులకు పొలంబడి నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ శనగ పంటపై అక్కడక్కడా తుప్పు తెగులు కనిపిస్తోందని, నివారణకు ప్రోఫికొనజోల్ మిల్లీ లీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు. వివిధ రకాల పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులంతా అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పొలంబడి నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టైలర్స్ సంక్షేమానికి ప్రభుత్వ కృషి అభినందనీయం



చేబ్రోలు: టైలర్స్ సంక్షేమానికి ప్రభుత్వ కృషి అభినందనీయమని అసోసియేషన్ చేబ్రోలు మండల అధ్యక్షుడు షేక్ గోరే అన్నారు. చేబ్రోలులో బుధవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలరింగ్ మిషన్‌ను కనుగొన్న విలియమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టైలర్లకు ఇళ్ల స్థలాలు, రుణాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని షేక్ గోరే కోరారు. అనంతరం ఇటీవల మరణించిన టైలర్స్‌కు నివాళులు అర్పించి, మౌనం పాటించారు. సీనియర్ టైలర్స్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బాలి, శంకర్, సుభాని, శ్రీను, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం



పొన్నూరు: పట్టణానికి చెందిన షేక్ మహబూబ్ (14) ఈనెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సీఐ పి. భాస్కర్ తెనాలిలో బంధువుల ఇంటిలో ఉన్న మహబూబ్‌ను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని రవి కాలనీకి చెందిన శాంతి వీరమ్మ నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇంజినీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు

పెదకాకాని: సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) సర్వీసులో ఉండగా అమరవీరులైన జవాన్ల పిల్లలకు ట్యూషన్ ఫీజు లేకుండా ఒక సీటు కేటాయించడంపై ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్య కళాశాలలు నిర్ణయం తీసుకోవడంపై సీఆర్‌పీఎఫ్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గోపాలకృష్ణ, ఐపీఎస్ ఉదయ భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రెసిడెంటు వాసిరెడ్డి విద్యాసాగర్‌ను బుధవారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ జనవరి 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాసాగర్ వివరించారు. కళాశాలలో సీటు పొందిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రాయితీ అందించనున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ సమ న్యాయం

సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందంటే అది ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమైందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. అమరావతి రోడ్డులోని హిమనీనగర్ 2వ లైనులో బుధవారం శ్రీ ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్టీ ఎరుకల సామాజిక వర్గం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమన్వయకర్త బలసానికి సంఘం నాయకులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమం, పథకాలు ప్రతి కుటుంబానికీ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అందుతున్నాయని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు వారిని మోసం చేసేందుకు మరోసారి కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

వైఎస్సార్ సీపీలోనే యువతకు ప్రాధాన్యత

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీలో రానున్న కాలంలో యువతకే అధిక ప్రాధాన్యత ఉంటుందని సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. అమరావతి రోడ్డు నగరాలు ప్రాంతానికి చెందిన సుమారు 100 మంది యువకులు బుధవారం ఏటుకూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గం కార్యాలయంలో సమన్వయకర్త బలసానిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమం, సుపరిపాలన ప్రజలకు వివరించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. సమాజాభివృద్ధికి, సరైన నాయకుడిని ఎంచుకునేందుకు జగనన్న లాంటి ప్రజా సంక్షేమ నాయకుడికి మరోసారి పట్టం కట్టేందుకు సైనికుల్లా కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని అందరికీ వివరించాలని సూచించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకునేందుకు యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదలకు గృహ యోగం



లబ్ధిదారులతో కుర్నూతల సర్పంచ్ గోపాలకృష్ణ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము



పుల్లడిగుంటలో పత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పర్వీన్ సుల్తానా

ప్రత్తిపాడు: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గృహ యోగాన్ని కల్పించిందని సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలో ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం లబ్ధిదారులకు సర్పంచ్ గోపాలకృష్ణ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలకు ఉచితంగా ఇంటి పట్టాలను రిజిస్టర్ చేసి ఇస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్షల రూపాయల విలువైన ఆస్తిని మహిళల పేరుతో రిజిస్టర్ చేసి ఇవ్వడం వారి కుటుంబాలకు భరోసానివ్వడమేనని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శివ, వీఆర్వో వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల పాలిటి దేవుడు జగనన్న

గుంటూరు రూరల్: పేద కుటుంబాల్లో వెలుగులు నింపి వారి పాలిట దేవుడుగా జగనన్న నిలిచాడని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) తెలిపారు. లాలుపురంలో బుధవారం పేదలకు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. గ్రామంలో 246 మందికి పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర, సేవా వజ్ర పురస్కారాలు అందజేశారు. గ్రామ ప్రజలకు డస్ట్ బిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి మీనాక్షి పాల్గొన్నారు.

పుల్లడిగుంటలో రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

గ్రామ సర్పంచ్ షేక్ పర్వీన్‌సుల్తానా, నూరుల్లాల ఆధ్వర్యంలో వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో బుధవారం మహిళలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పట్టాలు అందుకున్న లబ్ధిదారుల మోముల్లో అంతులేని ఆనందం కనిపిస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు చెయ్యని విధంగా పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చి, వాటిని ఉచితంగా రిజిస్టర్ చేయించిందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భారత్ ఖ్యాతిని ఇనుమడింపజేసిన సి.వి.రామన్

- పలు కళాశాలలో ఘనంగా సైన్స్‌డే
- సైన్స్ ప్రాధాన్యతను వివరించిన వక్తలు

గుంటూరు రూరల్: భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సి.వి. రామన్ అగ్రగణ్యుడని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28న రామన్ కనిపెట్టిన 'రామన్ ఎఫెక్ట్' ఫలితాన్ని ధ్రువీకరించిన రోజును నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె .శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కార్యక్రమ కార్యనిర్వాహక సభ్యులు కె. ప్రవీణ్‌కుమార్, ఎన్. ధరణీ కుమార్, డి. చక్రధర్, పి. శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్ కుమార్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చే బాధ్యత విద్యార్థులదే..

చేబ్రోలు: భారతదేశాన్ని సూపర్ పవర్‌గా మార్చే బాధ్యత విద్యార్థులదేనని డీఆర్‌డీవో సైంటిస్ట్–ఎఫ్ డాక్టర్ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నేషనల్ సైన్స్ డే సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ఫర్ వికసిత్ భారత్ అనే ఇతివృత్తంతో నిర్వహించారు. డాక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏదైనా అంశాన్ని లోతుగా పరిశోధిస్తేనే అత్యున్నత స్థాయి ఫలితాలను పొందగలరని తెలిపారు. ఎప్పుడూ కూడా ఇతరుల్ని అనుసరించే బదులు, మీరే క్రియేటర్స్‌గా మారాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉజ్వలంగా ఎదగగలరని చెప్పారు. అడ్వాన్స్ కాంపోసిట్స్ ఫర్ డిఫెన్స్ అప్లికేషన్స్ గురించి వివరించారు. విద్యార్థులు నానోటెక్నాలజీలో పట్టు సాధిస్తే మెడిసిన్, హెల్త్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, అడ్వాన్స్ మెటీరియల్స్ అండ్ టెక్స్‌టైల్స్, మెకానికల్ ఇంజినీరింగ్ అండ్ రోబోటిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని సూచించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సైంటిస్ట్ రామసుబ్బారెడ్డి

వివా స్కూలులో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పెదకాకాని : వివా స్కూలులో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ తదితర నమూనాలు ఆలోచింపజేశాయి. ప్రదర్శనలు తిలకించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. భౌతిక, రసాయన శాస్త్రాలపై అవగాహన కలిగిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్విజ్ పోటీల్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం హెడ్ కె.మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

చలపతి ఫార్మసీ కళాశాలలో వేడుకలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్‌డే వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన గ్రేట్ సైంటిస్ట్ చంద్రశేఖర్ వెంకటరామన్‌ను స్మరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ మాజీ ప్రిన్సిపాల్ పి.రత్నగీత మాట్లాడుతూ భారత్‌లో డిజిటల్ ఇండియా ఇప్పుడు దేశ ప్రజల జీవన శైలిలో ఒక భాగంగా మారిందని, టెక్నాలజీ పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు నూతన టెక్నాలజీలతో పలు నూతన ఆవిష్కరణలు తయారు చేసి ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆర్‌వీఆర్‌జేసీలో రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం



విజేతలతో కళాశాల యాజమాన్యం



జాతీయ సైన్స్‌డే వేడుకల్లో చేతన యాజమాన్యం

సైన్స్‌తోనే మానవ మనుగడ

గుంటూరు రూరల్: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి తెలిపారు. చౌడవరం గ్రామంలోని బాలకుటీర్ చేతనలో బుధవారం జాతీయ సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు చేసి సమాజాభివృద్ధికి తోడ్పడే దిశగా ఎదగాలని ఆకాంక్షించారు. చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి మాట్లాడుతూ సైన్స్ నా మతం అని చాటిచెప్పిన వ్యక్తి సర్ సి.వి. రామన్ అని తెలిపారు. సముద్రం నీలి రంగులో ఎందుకు ఉంటుందో తెలియజెప్పిన వ్యక్తి ఆయనని చెప్పారు. అనంతరం విద్యార్థులు శాస్త్రవేత్తల అలంకరణలో అలరించారు. కార్యక్రమంలో బాలకుటీర్ సీఈవో దుర్గారఘురామ్, ప్రిన్సిపాల్స్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, డీన్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

వట్టిచెరుకూరు తహసీల్దారు శ్రీనివాసరావుకు దళితుల వినతి

గుంటూరు రూరల్: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మండలంలోని అనంతవరప్పాడులోని దళిత కాలనీవాసులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో 800 మంది నివసిస్తున్నారని, శ్మశానవాటిక లేక పంట కాలువ కట్టపై శవాలను పూడ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా, తమ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి శ్మశానవాటికకు స్థలం చూపించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని పార్టీలు, కులమతాలకు అతీతంగా సేవా దృక్పథంతో అందిస్తున్న వారధులు వలంటీర్లు అని వైఎస్సార్ సీపీ అర్బన్ క్లస్టర్ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. 46వ డివిజన్ నగరాలు పరిధిలోగల గోరంట్ల సున్నం బట్టీల సెంటర్ సచివాలయం పరిధిలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర, సేవా వజ్ర పురస్కారాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇద్దరు మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమాన్ని ప్రజలకు అందించిన సేవా తత్పరులు వలంటీర్లు అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వలంటీర్లతో శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు

జగనన్న పాలనలో అభివృద్ధి పథంలో గ్రామాలు

గుంటూరు రూరల్: జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు పరుగులు పెడుతోందని 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి తెలిపారు. డివిజన్ పరిధిలోని నల్లపాడులో బుధవారం రూ. 25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్ని ఆమె పరిశీలించారు. నాణ్యతో పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రూ. 2.5 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కొన్ని టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు.



రోడ్డు నిర్మాణం పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

పెండింగ్ కేసులు తగ్గించాలి

ఎస్పీ తుషార్ డూడీ

పట్నంబజారు: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం గుంటూరు నగరంలోని ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గల పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పూర్తి స్థాయిలో పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ముఖ్యమైన కేసుల వివరాలు, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఎలక్షన్ సంబంధిత వివరాల అంశాలపై పాత గుంటూరు సీఐ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ కేసు దర్యాప్తులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పాటు, నిర్దిష్టమైన ప్లాన్, యాక్షన్‌తో పెండింగ్ కేసులు తగ్గించాలని ఆదేశించారు. నేర నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పాతగుంటూరు పీఎస్ పరిధిలో బస్టాండ్ ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐను ఆదేశించారు. తనిఖీల్లో ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచికేష్ షలేకే, స్పెషల్ బ్రాంచి సీఐ వెంకట్రావు, పాత గుంటూరు పీఎస్ ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని శాసనమండలి విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయిన చెక్కుల్ని బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్ని బలోపేతం చేస్తూ వైద్యాన్ని మన గుమ్మం వద్దకు తెచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది అన్ని జబ్బుల్ని చేర్చారన్నారు. నేడు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి ఒక్కరికీ రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు సైతం సీఆర్‌ఎఫ్ కింద నగదు మంజూరు చేస్తూ ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడే పరిస్థితులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల్ని చేపట్టి తండ్రిని మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా పరిపాలన చేస్తున్న మనస్సున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలబడాలని అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసరెడ్డి, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న విప్ అప్పిరెడ్డి

హెడ్ నర్సుగా రోజ్ రాణి సేవలు అభినందనీయం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో హెడ్ నర్సుగా పని చేస్తున్న దాసరి రోజ్ రాణి బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు సేవ చేయడం వరంలా భావించి హెడ్‌నర్స్ రోజ్ రాణి పని చేశారని అభినందించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్ వైద్య విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ టి.వి. శివరామకృష్ణ, డాక్టర్ జి. దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ఇంధన పొదుపు తప్పనిసరి

నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర్రామిరెడ్డి

నెహ్రూనగర్: మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరని నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర్రామిరెడ్డి తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నగరపాలక సంస్థ పంప్ ఆపరేటర్లకు ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుందర్రామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు ఇంధన పొదుపు అంశంలో కీలకంగా ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపుకే వినియోగిస్తున్నందున, ఇతర అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కూడా సంరక్షణ అమలు చేయాలని ఆదేశించారు.

పేద విద్యార్థుల చదువులకు చేయూత



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నారై విద్యాసంస్థల్లో అంతర్భాగమైన సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ (ఎస్ఎఫ్ఆర్ఎస్) ఆధ్వర్యంలో బీటెక్, లా కోర్సులు చదువుతున్న నలుగురు పేద విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం విద్యానగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఏవో మన్నవ రవిప్రసాద్, ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు విద్యార్థులు పి.హేమంత్ సాయి, పి. పూజిత, కె. అంజికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో చివరి విడతలో ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో ఇచ్చారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సులు చదువుతున్న 33 మంది విద్యార్థులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసినట్లు తిలక్‌బాబు చెప్పారు. ప్రొఫెషనల్ కోర్సులు చదువుతూ ఎస్ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆర్థిక సహాయాన్ని పొందగోరు విద్యార్థులు విద్యానగర్ 3వ లైనులోని సంస్థ కార్యాలయంలో సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.